# అలంకారాలు

**[XIII] అలంకారాలు :**

**1. వృత్త్యనుప్రాస :**

**లక్షణం** : ఒకటిగాని, అంతకంటె ఎక్కువ హల్లులు గాని అనేకసార్లు ఆవృత్తి అయినట్లయితే, (మరల మరల రావడం జరిగితే) దానిని "వృత్త్యనుప్రాస" అంటారు.

**ఉదా** : విష్ణు రోచిష్ణు సహిష్ణు కృష్ణు

**సమన్వయం** : పై ఉదాహరణములో 'ష్ణ' అనే హల్లు నాలుగు పర్యాయాలు ఆవృత్తి అయ్యింది. కాబట్టి ఈ పాదము 'వృత్యనుప్రాస' కు ఉదాహరణం.

**2. అంత్యాను ప్రాస :**

**లక్షణం** : 1) వాక్యం చివరలో గాని, పద్యపాదం చివరలో గాని, ఒకే హల్లుగాని, ఒకే పదం కాని వస్తే అది "అంత్యానుప్రాస',

**ఉదా** : హారతి **పళ్ళెం**

గుఱ్ఱపు **కళ్ళెం**

తలుపు **గొళ్ళెం**

**సమన్వయం** : 'పళ్ళెం', 'కళ్ళెం', 'గొళ్ళెం' అనే పదాలలో చివర 'ళ్ళ అనే ఒకే హల్లు వచ్చింది. పాదాల చివర ఒకే హల్లు వచ్చింది కాబట్టి 'అంత్యాను ప్రాస

**3. ఉపమాలంకారం :**

**లక్షణం** : ఉపమేయానికి, ఉపమానానికి చక్కటి పోలిక చెప్పినట్లయితే అది 'ఉపమాలంకారం' దీనిలో నాలుగు అంశాలు ఉంటాయి.

1) ఉపమేయం 2) ఉపమానం 3) ఉపమావాచకం 4) సమానధర్మం

**ఉదా** : సీత ముఖం చంద్రబింబం వలె ప్రకాశిస్తోంది.

**సమన్వయం** : పై ఉదాహరణములో

1) ఉపమేయం : సీతముఖం

2) ఉపమానం : చంద్రబింబం

3) ఉపమావాచకం : వలె

4) సమానధర్మం : ప్రకాశిస్తోంది

పై ఉదాహరణలో ఉపమానం, ఉపమేయం, ఉపమావాచకం, సమానధర్మం ఉన్నాయి. కాబట్టి ఇది ఉపమాలంకారమునకు ఉదాహరణ.

**4. రూపకాలంకారం :**

**లక్షణం** : 1) ఉపమేయానికి, ఉపమానానికి అభేదం చెప్పినట్లయితే అది 'రూపకాలంకారం అవుతుంది.

2) ఉపమేయమునందు ఉపమాన ధర్మాన్ని ఆరోపించినట్లయితే రూపకాలంకారం.

**ఉదా** : సంసార సాగరాన్ని ఈదడం చాలా కష్టం.

**సమన్వయం** : పై ఉదాహరణములో

1) ఉపమేయం : సంసారం

2) ఉపమానం : సాగరం

ఇక్కడ సంసారం, సాగరం అనే ఉపమేయ, ఉపమానాలకు భేదం ఉన్నా లేనట్లు అభేదం చెప్పబడింది. కాబట్టి ఇది రూపకాలంకారానికి ఉదాహరణం.

**5. అతిశయోక్తి అలంకారం :**

**లక్షణం** : గోరంతలను కొండంతలుగా వర్ణిస్తే అది అతిశయోక్తి ఉన్న వస్తువును గూర్చి అతిశయించి చెప్పడమే "అతిశయోక్తి అలంకారం.

**ఉదా** : 'తాటియంత విల్లు ధరియించినాడవు'

**సమన్వయం** : పై ఉదాహరణములో ఎత్తుగా ఉన్న విల్లు ధరించాడు. అని చెప్పడానికి, తాటిచెట్టు అంత ఎత్తు ఉన్న విల్లు ధరించాడని అతిశయంగా చెప్పబడింది. కాబట్టి ఇది 'అతిశయోక్తి' కి ఉదాహరణ.

## అలంకారాలు - ఏకవాక్య ప్రశ్నలు

[XIV] అలంకారాలు – ఏక వాక్య ప్రశ్నలు :

**1. 'అలంకారం' అంటే ఏమిటి ?**

జ. వ్యక్తం చేయవలసిన విషయాన్ని అందంగా మలిచేది అలంకారం.

**2. అలంకారాలు ఎన్ని? అవి ఏవి ?**

జ. అలంకారాలు రెండు రకాలు. 1) శబ్దాలంకారాలు 2) అర్థాలంకారాలు

**3. 'అర్థాలంకారాలు' అంటే ఏవి ?**

జ. అర్థం ప్రధానమైన అలంకారాలు అర్థాలంకారాలు.

**4. 'ఉపమేయం' అనగా ఏమిటి ?**

జ. 'ఉపమేయం' అనగా వర్ణించే వస్తువు.

**5. ఉపమాన ఉపమేయాలకు అభేదం చెప్పే అలంకారం ఏది ?**

జ. రూపకాలంకారం

**6. అంత్యానుప్రాసకు ఉదాహరణం చెప్పండి.**

జ. "కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా"

✲✲✲